తెరవబడని తలుపు

"వట్టి చెత్త! నా కాలాన్ని పాడుచేశావ్"

"నిజంగానా?"

"అబద్ధం అనుకుంటున్నావా? మూడు రోజులు - రోజుకు రెండు గంటల చొప్పున ఆరు గంటల కాలం వృథా అయింది"

బ్రహ్మానందం, శశిరేఖ వైపుకు చిరుకోపంగా చూశాడు. ఆమె యీజీ చైరులోనుంచి లేచి, టేబిలు మీద బ్రహ్మానందం విసిరికొట్టిన పుస్తకాన్ని అందుకుంటూ -

"అందుకే మిమ్మల్ని సొంతం చదవమన్నది, నా స్నేహితురాలు"

"అనసూయా!"

"ఆఁ! ఆమే! యిది వల్లమాలిన నవలంటూ ఏమేమో చెప్పి యిచ్చింది"

"అవును! అలాంటి వాళ్ళకు యీ రకం నవలలు చాలా బావుంటాయ్" - బ్రహ్మానందం సిగరెట్టు ముట్టించి గట్టిగా రెండుసార్లు పీల్చి....

"ఈ నవలలో చెప్పబడిందే నిజమైన ఆదర్శ ప్రేమ అయితే, అది దేవతలకు దయ్యాలకు కూడా వద్దు. ఇక మనుషులు...."

శశిరేఖ మధ్యలో అందుకుని -

"కథానాయకుడు - ఆమె ప్రేమించి పెళ్ళి చేసుకునేటప్పుడు అందంగా ఉండేవాడు గదా? సరే పెళ్ళయింది. బాగానే వుంది. యుద్ధంలో తిన్న గాయాలతో ఆ ముఖమంతా గుంటలూ, సొట్టలూ పడిపోతే - మరి యింకా అతగాణ్ణి ఎలా ప్రేమించిందా అని నాకు అనుమానం!"

"ఇదంతా ప్రచార సాహిత్యం. యుద్ధంవల్ల ఆ దేశాల్లో దాదాపు అందరు మొగాళ్ళూ ఏదో వొక అంగవైకల్యం పొందారు. మరి స్త్రీలు అలాంటి వాళ్ళను వదిలేయకుండా ఉంచాలంటే ఏదో ఒక మనోవైకల్యాన్ని ఆదర్శప్రేమ పేరుతో పిలిచి, వాళ్ళ అంగవైకల్యానికి చేతకాని....అదీ యీ ఆదర్శం...."

"అసలు అంత వికారంగా కనబడే మగాళ్ళను, ఒకప్పుడు ప్రేమించి పెళ్ళి చేసుకుంటే మాత్రం, ఆడవాళ్లు తరువాత కూడా ఎలా భర్తలుగా అంగీకరించగలుగుతారు?"

"ఏదో ఆదర్శమనీ, మానవత్వమనీ, దాని హుందాతనమనీ - యింకా యింకా అలాంటివే కొన్ని కల్పించుకుంటే సరి"

శశిరేఖ దీర్ఘంగా పైకి రెండు నిమిషాలు చూచి, హఠాత్తుగా ఏదో ఆలోచన తట్టినట్టు లేచి బ్రహ్మానందం దగ్గిరకు వస్తూ - "మిమ్మల్ని నేనెందుకు ప్రేమించాననుకున్నారు?" అని ప్రశ్నించింది.

"ఏమో!" - బ్రహ్మానందం కొంటెగా చూశాడు.

"ఈ ముక్కు, యీ గడ్డం, యీ వంపు...."

ముక్కు మీద రెండు ముద్దులు, గడ్డానికొకటి - మొత్తం మూడు.

"ఈ ముక్కూ, గడ్డం యిలా లేకపోయినట్లయితే?"

"ఏం! భారతదేశం యిక మగాళ్ళులేక గొడ్డుపోయిందా?"

బ్రహ్మానందం - బ్రహ్మాండం బద్దలయేట్టు నవ్వుతూ ఆమెను దగ్గరకు లాక్కున్నాడు.

"మరి నిన్నెందుకు ప్రేమించాననుకున్నావ్?" - ఆమె విశాల నేత్రాలను అతి సున్నితంగా ముద్దుపెట్టుకుంటూ ప్రశ్నించాడు.

"ఉఁహు! నాకు తెలియదు. మీరే చెప్పండి"

"ఈ సువిశాల నేత్రాలు, మెడలో వొంపు, నున్నని పాలభాగం, మృదువైన శరీరం...."

"ఆపండి! యింక చాలు" - శశిరేఖ అతని పట్టు వదిలించుకొని లేవబోయింది.

"ఆగు మధ్యలో వెళితే ఎట్లా? అంతా చెప్పనీయ్"

"ఆ ప్రబంధ వ్యవహారమంతా నాకెందుకు?"

"ప్రబంధ స్త్రీలు మాత్రం నీకంటే ఎక్కువ అందంగా ఉంటారనా?"

"ఏమో ఎవరు చూశారు?"

"భలే పాండిత్యం! ఆదర్శ ప్రేమను అవతల పారేసి రుబాయత్స్ అందుకో, బుర్ర పాడైంది"

"అమ్మో! ఆ పుస్తకం పారేయటమే! దాన్ని అనసూయకు జాగర్తగా తిరిగి యిచ్చేయాలి"

"చాలాసార్లు అడుగుదామని మరిచిపోయాను. అనసూయ భర్త ఎక్కడున్నాడు?"

"ఆమె నడిగితే తనకే తెలియదంటుంది. అరెస్టు కాకుండా తప్పుకు తిరుగుతున్నట్టా"

"అంత కర్మం ఏమొచ్చే? శుభ్రంగా బయటికి వచ్చి అరెస్టవరాదూ?"

"అదే నాకు ఆశ్చర్యం! కాంగ్రెసులో చేరి నాలుగుసార్లు జైలు కెళ్ళాడు. మరి యిప్పుడు స్వరాజ్యం వచ్చిన తరువాత కూడా యీ భయం ఏమిటో నాకు అర్థం కాదు"

"ఆమె బ్రతుకు తెరువు?"

"మిషన్ కుట్టుకుంటుంది"

"స్కూలు ఫైనలు చదివింది. తెలివితేటలున్నాయ్. యిదీ అవస్థ –"

"రిజిష్టర్ మారేజి చేసుకుంది గామాలు. తేలిగ్గా వదిలేసి యింకోణ్ణి చేసుకోవచ్చుగా?"

"కొంపతీసి మన యింటికి వచ్చినప్పుడు యీ మాట అనేరు. ఇక మనం బతికే ఆస్కారం ఉండదు. ఈమధ్య ఒకసారి అతణ్ణి చూశాను. అంతా బైరాగిలా ఉన్నాడు. మాసిన గడ్డం - మురికి గుడ్డలూ – "

అప్రయత్నంగా బ్రహ్మానందం గడ్డం మీదికి పోయిన ఆమె చేయి ఒక్కసారి వులిక్కి పడింది.

"తెల్లవారి మీరు గడ్డం చేసుకోలేదు. నిజం చెప్పండి?" – డోక్కోబోతున్న దానిలా ముఖం పెట్టి ప్రశ్నించింది.

బ్రహ్మానందం బిక్క ముఖం వేసి – "చేసుకోలేదు. మరచిపోయాను" అన్నాడు.

"ప్రతిరోజూ చేసుకుంటానని వొట్టుపెట్టారు గుర్తుందా?"

అతడు బోనులో నిలుచున్న ముద్దాయిలా గిజగిజలాడాడు.

శశిరేఖ మామూలుకన్న హెచ్చుస్థాయిలో –

"మిమ్మల్ని గడ్డం చేసుకోకుండావున్న రోజున చూడటమంటే నాకు నిజంగా డోకు వచ్చేంతపని జరుగుతుంది. పని తొందర అంటూ యీ మధ్య మీరు స్నో రాసుకోవటం మానేశారు. మిమ్మల్ని నేను మన వివాహపు ప్రథమ దినాల్లోలాగే ప్రేమిస్తుండాలంటే, యిలాంటివన్నీ మానుకోవాలి. నిజం చెప్పాలంటే యీ రాత్రికైనా మీరు గడ్డం చేసుకోకుండా వుంటే తెల్లవారి మిమ్మల్ని చూస్తే రామదాసు జైలుసీను నాకు జ్ఞాపకం వస్తుంది. మీరిలా చేస్తుంటే నేను ఎట్లా ప్రేమించగలను?"

శశిరేఖ చరచరా నడిచి తన గదిలోకిపోయి, తలుపు బిగించింది.

బ్రహ్మానందం యింకో సిగరెట్టు తీసి ముట్టించాడు.

ఆమె అన్నది నిజం! తను అందంగా వుంటానని తగు జాగర్తలు తీసుకోకపోతే ఆమె ఎలా ప్రేమించగలుగుతుంది? ఒకసారి ప్రేమించి పెళ్ళిచేసుకున్న తరువాత మొగుడు ఎలాంటి అందవికారాన్ని ఏ ఆదర్శం కోసం పొందినా సహించి వూరుకోవటానికి యీమె చచ్చిన నవలల్లోని స్త్రీ కాదాయె!

తను అందంగా వుండాలి. తనే రోజూ గడ్డం చేసుకోకుండా, స్నో రాసుకోకుండా, సెంటు పూసుకోకుండా ఆమె దగ్గరకు వెళ్ళటమంటే నిజంగా ఆమె అందాన్ని వెక్కిరించినట్టే!

బ్రహ్మానందం ఆమె గది వంక కాసేపు చూశాడు. ఆమె ఆ వైపున గొళ్ళెం పెట్టుకుంటున్నట్టుంది. ఈ వైపు నుంచి తలుపు తట్టినా లాభంలేదు. ఇటు తను గడియ వేస్తే? ఛా! ఏమిటీ యీ ఆలోచనలు!

తనకు ఆమె మీద ప్రేమ తగ్గిపోతుందా? ఉహూఁ! లేదు. ఆ అందమైన సోగకళ్ళు, నున్నని ముఖం....తన ముక్కన్నా, గడ్డమన్నా ఆమెకు ఎంత ప్రేమ!

యీజీ చైరులో పడుకొని అలాగే ఎంతో సేపు ఆలోచించాడు. నెమ్మదిగా నిద్ర మైమరపించింది. కలత నిద్దరలో బ్రహ్మానందానికి కళ్ళు, ముక్కులు, గడ్డం, సేఫ్టీ రేజరు, స్నో బుడ్డి – ఒకదానిమీద వొకటి, వొక దాంట్లో యింకొకటి కనబడసాగినై. ఏదో కలవరిస్తూ కలత నిద్దరలో వున్నాడు.

ఎవరో గట్టిగా తలుపు తట్టిన శబ్దం.

బ్రహ్మానందం ఉలిక్కిపడి లేచాడు. ఎవరు? శశిరేఖా?

"డాక్టరుగారూ! డాక్టరుగారూ!"

మళ్లీ గట్టిగా తలుపు తట్టారు.

కళ్లు నులుపుకుంటూ మెట్లు దిగి తలుపు తెరిచాడు.

మాసిన గడ్డం, చిరిగిపోయిన చొక్కాతో ఒక నడికారు వ్యక్తి చేతిలోని మసక లాంతరును అటూ యిటూ తిప్పుతూ తలుపు తియ్యగానే రెండు మెట్లు కిందికి దిగి నమస్కరించాడు.

"ఇంత అర్ధరాత్రి వేళ ఏంపని?"

"మావాళ్ళు మందు తిన్నారు. తమరు వెంటనే రావాలి!"

"మా వాళ్ళంటే?"

"నా భార్య"

తన రెండు సంవత్సరాల ప్రాక్టీసులో యిలాంటి కేసుల్లో యిది ఆరోది. తనకు బాగా జ్ఞాపకం.

ఆ వచ్చినవాడు దీనంగా, వెంటనే బయలుదేరమని ప్రార్థిస్తున్నాడు.

"డ్రైవరు యింటికెళ్ళాడు. జట్కా పిలుచుకురా"

"జట్కా బండి కోసం చాలాదూరం పోవాలి. నా భార్య చాలా ప్రమాదస్థితిలో ఉంది. నేను కారు నడపగలను" అన్నాడు.

"నీవు డ్రైవరువా?"

"కాదు. ఫిట్టరు పని చేస్తుంటాను. డ్రైవింగు కొంత తెలుసు. తమరు వెంటనే బయలుదేరితే..."

బ్రహ్మానందానికి అతడి ఆదుర్దా, విచారమూ చూస్తే జాలి కలిగింది.

కారు షెడ్‌లో నుంచి రోడ్డు మీదికి వచ్చింది.

వెనక సీట్‌లో కూర్చుంటూ, "నీ పేరేమిటి?" అని బ్రహ్మానందం ప్రశ్నించాడు.

"రామస్వామి"

"చెప్పటం మరిచిపోయాను. లెఫ్ట్‌హ్యాండ్ డ్రైవు జాగ్రత్త"

కారు వేగంగా నడుస్తోంది. బ్రహ్మానందం ఆలోచనలో పడ్డాడు. తన గడ్డం యీ మాత్రం

మాసినందుకే, శశిరేఖ భరించలేకపోయిందే - మరి రామస్వామి గడ్డాన్ని చూస్తే ఎవరైనా ప్రేమించగలరా?

అంత అసహ్యంగాఉన్న అతని గడ్డాన్ని చూసి, భరించలేకే అతని పెళ్ళాం మందు తిన్నదా? అడిగితే?

"నీ భార్య మందు ఎందుకు తిన్నది?"

రామస్వామి చేతులూ, కాళ్లూ వణికినై. కారు రోడ్డంతా గుత్తకు తీసుకున్నది.

"ఏదో చిన్న తగువు. అంతే! మందు తినేసింది"

బ్రహ్మానందం మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

దాంపత్య జీవితంలో చిన్న తగువులు, బుల్లి గలాటాలు - యింకా ఆ సంబంధమైన ప్రణయ కలహాలు, దంపతుల మధ్య ప్రేమను యితోధికం చేయటానికి ఎంతో తోడ్పడతై అని వాత్స్యాయనుడి దగ్గరి నుంచి, ఎల్లిస్ వరకు చెప్పారుకదా! మరి యీ మాత్రానికి ఆమె మందు ఎందుకు తినేసిఉంటుంది? అసలు కారణం యింకోటై ఉండాలి! ప్రశ్నిద్దామా?

"నీవేమైనా గట్టిగా చేయి చేసుకున్నావా?"

కారు రోడ్డు మీది నుంచి సాంతం క్రిందికి దిగిపోయింది.

బ్రహ్మానందం కంగారు పడ్డాడు. ఏదో ప్రమాదం నుంచి బయట పడ్డవాడిలా తృప్తి పడ్డాడు. డ్రైవింగు చాతకాకో, లేక భార్య ప్రమాదావస్థలో ఉందనో, రామస్వామి గాభరా పడుతున్నాడు. ఇక అతణ్ణి ప్రశ్నించకూడదు.

బ్రహ్మానందం తిరిగి ఆలోచనలో పడ్డాడు.

చూస్తూ చూస్తూ హాయిగా, ఆనందంగా గడపవలసిన జీవితాన్ని, మనుషులు మధ్యలో యింత బాధాకరంగా ఎందుకు అంతం చేసుకోవాలని ప్రయత్నిస్తారు?

చచ్చిపోవటంలోనే ఆనందం, విముక్తి ఉందనుకునే వాళ్ళు తేలిగ్గా, సునాయాసంగా ఆ కార్యం సాధించుకునేందుకు ఎన్ని మందుల్లేవు? భార్య చాలా బాధపడుతున్నదని చెబుతున్నాడు. ఆమె ఏ మందు తిని వుంటుంది? ఈ ప్రశ్న తను ఎప్పుడో అడిగి జవాబు తెలుసుకోవలసింది. అది తెలుసుకోకుండా తను చేయబోయే చికిత్స ఏముంటుంది?

ఈ ఒక్క ప్రశ్న అడగాలి.

"రామస్వామీ!"

స్టీరింగు వదిలేసి అతడు భయంగా వెనక్కు తిరిగి చూశాడు. మళ్ళీ కారు రోడ్డు కిందికి దిగబోయే దశలో, ముందుగా జాగర్త పడ్డాడు.

ప్రశ్నిద్దామా? వద్దా? - బ్రహ్మానందం సందేహిస్తున్నాడు. కారు రోడ్డంతా కలయ తిరుగుతూ, వేగంగా పోతోంది. ఒకటి - రెండు మలుపులు, తరువాత పెద్ద కాలవ బ్రిడ్జి.

"ఏం మందు తిన్నది?" - తనకు తెలియకుండానే నోరు జారింది.

"గన్నేరు పప్పు, నల్లమందు, మంచి నూ....నె" - తక్కిన మాటలు భయంకరమైన శబ్దంలో కలిసిపోయినై.

బ్రిడ్జి సైదున వున్న రెండు బలమైన యినప కమ్ములు ఎగిరి కాలవలో పడినై.

❀ ❀ ❀

ఇంకో గంటలో టీపార్టీ. తలుపుకు ఆ వైపున విపరీతమైన కోలాహలంగా వుంది. నవ్వులు, హాస్యం, అంతా అదో ఆహ్లాద ప్రపంచం. మరి తనో -

నెలలూ రోజులూ లెక్కించసాగాడు. ఆ తలుపు హఠాత్తుగా శశిరేఖ చేత మూయబడి ఇప్పటికి ఆరు నెలల పదహారు రోజులైంది.

ఇవ్వాళ యీ ఆనంద ముహూర్తంలో అది తెరవబడుతుందా? శశిరేఖకు తనంటే ప్రేమ లేకపోవచ్చు. కాని ఎంత గౌరవం!

మాణిక్యారావును పెళ్ళిచేసుకోవటంలో ఆమె పొరబడి ఉంటుంది! వాడు! వాడు! తను ముఖమంతా కట్టు కట్టబడి ఆసుపత్రిలో పడివుంటే, పక్కన శశిరేఖ ఏడుస్తున్నదన్న జ్ఞానం లేకుండా, ఆ రోజున పక్కకు తల తిప్పుకొని ఎంత ఆనందంగా వెకిలి నవ్వులు నవ్వుకున్నాడు!

ఈ ప్రపంచంలో తనకు యీ దురవస్థ ప్రాప్తించినందుకు అందరి కంటే ఎక్కువగా సంతోష పడినవాడు మాణిక్యారావు. కానీ, అందరి కంటే ముందు విచారాన్ని చూపించటానికి వచ్చింది కూడా వాడే!

అసలు ఆనాటి రాత్రి 'రామస్వామిని' అంటూ వచ్చింది వీడు కాదు గదా? బ్రహ్మానందం కుడిచేతి పట్టు మీద మంచంలో నుంచి లేచి అద్దం ముందు కెళ్ళాడు. ఎడమచేతి స్థానంలో ఖాళీ లాల్చి చేయి వూగుతోంది. చేత్తో క్రాపు సవరించుకున్నాడు.

తలుపు అవతలి నుంచి శశిరేఖ నవ్విన ధ్వని. మాణిక్యారావు ఏదో అంటున్నాడు.

బ్రహ్మానందం అద్దానికి ఎదురుగా కుర్చీలో కూలబడ్డాడు.

"శశిరేఖతో నా పెళ్ళి సందర్భంగా యీ సాయంకాలం ఐదు గంటలకు జరగబోయే టీపార్టీకి తప్పక రాగోరెదను"

మాణిక్యారావుకు తనంటే ఎంత లోకువ! తన ప్రస్తుత దుస్థితికి ఎంతగా ఆనందిస్తున్నాడు! ఈ ఆహ్వానంలో ఎంత కొంటెతనముంది!

కార్డును విసిరి నేలకు కొట్టాడు.

తను ఏ ముఖం పెట్టుకొని (అసలు తన ముఖం ఏదీ!) అంతమంది ఆహ్వానితుల్లో కూర్చో గలడు?

తనకే యింత భయంకరంగా కనబడే తన రూపాన్ని శశిరేఖ ప్రేమించలేదు. అంతవరకూ తను అర్థం చేసుకోగలడు.

ఇంకా యీ స్థితిలో కూడా ఆమెను తన భార్యగా వుండమని కోరేటంత నైతిక పతనానికి

తను దిగజారలేదు. ఆమె ఎంతగానో ప్రేమించే, కాంక్షించే, ఆ ముక్కూ గడ్డంతో పాటు; చెంపలూ, చెవులూ, కూడా గుంటలు పడిపోయె! ఇలాంటి భయంకర రూపంతో తనువుండి కూడా -

ఒకసారి భార్యనయ్యావు కాబట్టి ఎల్లకాలం భార్యగానే పడివుండమని తను ఎలా ఆమెను అడగ్గలడు?

"ఈ తలుపుతో హద్దు చేసుకొని యీ వైపు భాగపు మేడంతా మాది. అవతల బ్రహ్మానందం గారిది"

మాణిక్యారావు అప్పుడే 'మాది' అనేవరకు వచ్చాడు!

బ్రహ్మానందం తన గుండెల్ని ఎవరో గాలం వేసి గుంజుతున్నట్టుగా బాధపడ్డాడు. దేవుడున్నాడనే నమ్మకం వున్నవాడయినా ఆ క్షణంవరకూ తను ఎప్పుడూ అతగాణ్ణి ప్రార్థించిన పాపాన పోలేదు. కాని ఆ క్షణంలో ఏ భావం, ఏ ఆధ్యాత్మికశక్తి అతణ్ణి పురికొల్పిందోగాని అతడు ఒంటిచేతిని పైకెత్తి -

'ఈశ్వరా! శశిరేఖ నా భార్య కాకుండా పోయిందనే విచారం నాకు లేదు. కాని ఆమె ప్రవేశించిన యీ కొత్త జీవితంలో ఏ ఒడిదుడుకులు లేకుండా ఆమెను కాపాడు!' అని రెండు నిమిషాలు నిశ్చలంగా కళ్లు మూసుకున్నాడు.

రోజులు క్రమక్రమంగా గడిచిపోతున్నై. బ్రహ్మానందం జీవితంలో ఏ మార్పు లేదు. కాలం గడిచినకొద్దీ తన కొత్త రూపానికి అలవాటు పడవలసిందిపోయి, అతను ఉన్నకొద్దీ అసలు అద్దం దగ్గిరకు వెళ్ళటానికే భయపడుతున్నాడు.

శశిరేఖ తిరిగి పెళ్లిచేసుకున్న తరవాత ఎప్పుడూ అతణ్ణి చూడటానికి రాలేదు. కాని ప్రతిరాత్రి తలుపుకు ఆ వైపు నుంచి ఆమె మధురమైన కంఠస్వరం వినబడుతూనే ఉండేది. బ్రహ్మానందాన్ని ఆ ధ్వని ఆకాశంలోకి, క్రొత్త ప్రపంచ సీమల్లోకి, తీసుకు పోతూండేది. అలాంటి సమయాల్లో ఎన్నెన్నో భావాలు, ఆవేశాలు అతన్ని చుట్టుముట్టేవి. కాని అప్పుడప్పుడు ఆమె శ్రావ్యమైన కంఠధ్వనితో మేళవించటానికి ప్రయత్నించే, మాణిక్యారావు గొంతు అతన్ని ఉద్రిక్తుణ్ణి చేసేది.

పట్టణంలో స్ఫోటకాలు జాస్తిగా ఉన్నవని ఒక రోజున శశిరేఖ ఎవరితోనో చెపుతూ వుండగా విన్నాడు.

"నేను వాక్సినేషన్ చేయించుకోను. స్ఫోటకం అంటువ్యాధి!"

తను తలుపుకు యీవైపు నుంచి గట్టిగా అరవాలనుకున్నాడు. కాని అలాంటి సలహా యిచ్చే యోగ్యతా ధీమా తనకేది?

శశిరేఖ వాక్సినేషన్ చేయించుకోలేదు. నాలుగైదు రోజుల తరవాత ఆమెకు జ్వరం వచ్చిందని మాణిక్యారావు ఎవరితోనో అనటం తనకు వినబడింది. స్ఫోటకం కాదు గదా?

ఆ రాత్రి బ్రహ్మానందానికి నిద్దర పట్టలేదు. ఏం జ్వరం అయి ఉంటుంది?

రెండవనాటికి అతనికి సంశయ నివృత్తి కలిగింది. స్ఫోటకమనీ, ముఖం నిండా కళ్ళల్లోను చాలా తీవ్రంగా పోసిందనీ మాణిక్యారావు ఎవరితోనో చెపుతున్నాడు.

బ్రహ్మానందం బిగ్గరగా ఏడ్చాడు. ఆ కళ్లు – నక్షత్రాలను మరిపించే ఆ విశాల నేత్రాల్లో – ఆ పైన అతడు వూహించుకోలేకపోయాడు.

ఇంట్లో ఎందరు నౌకర్లు ఎన్ని చెప్పినా వరసగా మూడు రోజులు అన్నం ముట్టలేదు సరిగదా, ఆఖరుకు మంచినీరు కూడా తాగలేదు. ఏదో బాధ అతడి నరనరాల్నీ పట్టి పీడించసాగింది. నాలుగోనాడు అతడికి స్పృహ తప్పింది.

"టైఫాయిడ్! తిరుగుముఖం పట్టినట్టుంది"

ఎక్కడో ఏదో లోకాన్నుంచి ఎవరో మాట్లాడుతున్నట్టు బ్రహ్మానందానికి వినబడింది.

ఆమె అంటోంది –

"టైఫాయిడ్ ఎవరికి? శశిరేఖకా? ఆమెకు స్ఫోటకం అన్నారుగా?"

"ఆమెకు స్ఫోటకం నయమయింది. ఒక కన్ను పోయింది. మనం గుర్తు పట్టలేనంత వికృతంగా ముఖం తయారైంది. ఎలాగైతేనేం బ్రతికి బయటపడింది. మీరు టైఫాయిడ్ నుంచి గట్టెక్కారు. యిప్పటికి ముప్పై...."

"రోగి మంచం దగ్గిర నుంచి ఆ ముసలిదాన్ని బయటకు పంపండి!" – ఎవరో గట్టిగా కేక వేశారు.

శశిరేఖ ఒక కన్ను పోయిందా? కురూపిగా, వికృతంగా తయారైందా?

తనకు టైఫాయిడ్ అనే మాట మాత్రం బ్రహ్మానందానికి గుర్తులేదు.

ఆమె కోసం – ఆమె ప్రస్తుత దురవస్థను తలచుకొని ఎంతోసేపు లోలోన దుఃఖించాడు.

"చూపులకే వికారం పుట్టించేటంత అసహ్యంగా వున్న దానితో నేను కాపరం చేయలేను. బాంబే పోతున్నాను" అన్నాట్ట మాణిక్యారావు మా అన్నయ్యతో.

ఎవరో ఎవరికో తన మంచం దగ్గిర నుంచుని చెపుతున్నారు.

బ్రహ్మానందం యిక వాళ్ల మాటలు వినదలచుకోలేదు. తన ఒక్క చేతినీ తల చుట్టూ చెవుల కడ్డంగా తిప్పుకున్నాడు.

ఆనాటినుంచి యిరవై రోజుల తరవాత, ప్రతి రాత్రి పది గంటల నుంచి తెల్లవారు ఝాము నాలుగు గంటల వరకు – ఆ తలుపుకు యిరువైపుల రెండు భయంకర మానవ జీవాలు తిరుగుతూండేవి.

బ్రహ్మానందం యీ వైపు నుంచి తలుపు గడియ తీద్దామని దగ్గిర దాకా వెళ్లి తన వికృత ముఖాన్ని తలుచుకొని వెనక్కి తిరిగి వెళ్లేవాడు.

శశిరేఖ ఆ వైపు నుంచి గొళ్లెం తీద్దామని దగ్గిర దాకా వచ్చి తన గుడ్డి కంటినీ, రోత పుట్టించే తన ముఖం మీది గుంటల్నీ, మచ్చల్నీ గుర్తుకు తెచ్చుకుని వెనక్కి తిరిగి వెళ్ళేది.

ఆ తలుపు ఎవరిచేతా తెరవబడలేదు!

※

(ప్రచురణ : 1940–49 మధ్య)